క్లుప్తంగా

ఉదయగిరి ఏపీపీకి అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సుకన్య

ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఏపీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్. సుకన్యకు ప్రతిభా అవార్డు లభించింది. ఇటీవల విజయవాడలో నిర్వహించిన జోన్–3, 4 సదస్సులో విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినందుకు గుర్తింపుగా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జే సుదర్శన్‌రెడ్డి అవార్డు అందించారు. ఈ అవార్డు లభించడంపై సోమవారం పలువురు న్యాయవాదులు, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

మినీ ట్రక్కు బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన మినీ ట్రక్కు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం బద్వేల్ నుంచి నెల్లూరు వైపు అరటి కాయల లోడుతో వెళ్తున్న మినీ ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మె నోటీస్ అందజేత



ఎంఈఓకు సమ్మె నోటీసును అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆత్మకూరు: మండల విద్యాశాఖ కార్యాలయాల్లో పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని, త్వరలో సమ్మె చేయనున్నట్లు ఆ మేరకు సమ్మె నోటీసును ఎంఈఓకు అందజేశారు. ఆత్మకూరు ఎంఈఓ కార్యాలయంలో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సీఆర్‌ఎంటీలు, ఎంఆర్‌సీలు కలిసి ఎంఈఓ షేక్ నజీర్‌బాషాకు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

చేజర్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండలం ఆదూరుపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పెంచలకోన రోడ్డులో ఓ ఇంట్లో వంగపాటి లక్ష్మయ్య కుటుంబ సభ్యులు అద్దెకు ఉంటున్నారు. ఆదివారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో మెయిన్ లైన్ ఆఫ్ చేశారు. అప్పటికే ఇంట్లో మంటలు చెలరేగడంతో ఫ్రిజ్, మొబైల్, దుస్తులు కాలిపోయాయి. స్థానికులు మంటలు ఆపేశారు. ఒకటిన్నర లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు లక్ష్మయ్య తెలిపారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న డీటీ సుప్రభ

ఆత్మకూరు: ఈవీఎంలపై (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని స్వయంగా ఈవీఎంలను పరిశీలించవచ్చునని ఆర్డీఓ కార్యాలయ ఎన్నికల ప్రత్యేక డిప్యూటీ తహసీల్దారు సుప్రభ అన్నారు. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఈవీఎంల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంలను స్వయంగా ఆపరేట్ చేయించారు. పలు అనుమానాలను నివృత్తి చేశారు. డీటీ సుప్రభ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలను అన్ని స్థాయిల్లో క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రజల అనుమానాలు నివృత్తి అయ్యేలా చేస్తున్నామన్నారు.

పోలీసుల తనిఖీ



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి టోల్‌గేట్ వద్ద ఎస్సై విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్యశ్రీ మహోన్నత పథకం

ఆత్మకూరురూరల్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ మహోన్నత పథకమని, ఆ పథకాన్ని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్విజయంగా అమలు చేస్తూ జాతీయ స్థాయిలోనే ప్రశంసలు అందుకుంటుందని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని నువ్వూరుపాడు సచివాలయంలో సోమవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.25 లక్షలకు పెంపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు కొన్ని ఆరోగ్య సమస్యలకు మాత్రమే పరిమితమైన ఈ పథకం ప్రస్తుతం క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు సైతం అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షల మేరకు ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం కల్పిస్తుందన్నారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మహిమలూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూషాకుమారి మాట్లాడుతూ వలంటీర్లు అందరూ ఆరోగ్యశ్రీ యాప్ ఈకేవైసీ పూర్తి చేసి లబ్ధిదారులకు మెరుగైన వైద్య సేవలు అందేందుకు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కటారి దొరసానమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు సైదా, జిలానీ, ఎంపీటీసీ గడ్డం సుచిత్ర, దేపూరు సర్పంచ్ రావిళ్ల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాసులు రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డు విడుదలపై హర్షం

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డు విడుదలపై సోమవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీవీల ద్వారా అధికారులు, నాయకులు వీక్షించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించడంతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధునాతన వైద్య సేవలు పొందేలా ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, చేజర్ల సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



చేజర్ల: టీవీలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు

ప్రతి ఇంటికీ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ

జలదంకి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కొత్త ఫీచర్లతో స్మార్ట్ కార్డుల పంపిణీ మంగళవారం నుంచి పంపిణీ చేస్తామని ఎంపీడీఓ బత్తిన సింగయ్య తెలిపారు. ఆరోగ్యశ్రీ ఉచిత సేవలను ఎలా వినియోగించుకోవాలనే సందేహాలను వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అధికారులు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ప్రతి ఇంట్లో ఆరోగ్యశ్రీ యాప్‌తో పాటు దిశ యాప్ కూడా ఇన్‌స్టాల్ చేసేలా మండలంలోని అధికారులకు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు తెలియజేసినట్లు వివరించారు. జనవరి 1 నుంచి ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం మొదలవుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అల్లూరు: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆరోగ్యశ్రీపై వీడియో కాన్ఫరెన్స్

అల్లూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆరోగ్యశ్రీ అవగాహనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండల అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ ఫణికుమార్, వైస్ ఎంపీపీ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలపై సమీక్ష

సంగం: కావలి కాలువకు సాగునీరందించే సాధ్యాసాధ్యాలపై స్థానిక ఇరిగేషన్ గెస్ట్‌లో కావలి కాలువ ఈఈ శ్రీనివాసులు, డీఈ వెంకటరమణయ్య, ఆయకట్టు రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు రైతుల నుండి పలు సలహాలు, సూచనలు తీసుకున్నారు. ప్రస్తుతం నారుమడులు ఎండిపోయే పరిస్థితి ఉందని, తక్షణంగా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని రైతులు విన్నవించారు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కావలికాలువ ఏఈ రమణయ్య రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

అధికారిక ఆయకట్టులో చేర్చాలని వినతి

కావలి కాలువ కింద భూములను అధికారికంగా ఆయకట్టులో చేర్చాలని కోరుతూ సంగం ఎంపీడీఓ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఆయకట్టుదారులతో సమానంగా తమకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు.

శాస్త్రోక్తంగా కామాక్షిదేవి గర్భాలయానికి భూమి పూజ

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కొలువైన కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో సోమవారం కామాక్షి గర్భాలయం పునర్నిర్మాణానికి నిర్మాణ పూజ శంకుస్థాపన మహోత్సవాన్ని బ్రహ్మశ్రీ కసుమల్ల సత్యనారాయణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు అన్నవరపు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల విజయ్‌కుమార్ దంపతులు, కాంట్రాక్టర్ ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, కుమారుడు చేతన్ సాయి ఉభయకర్తలుగా వ్యవహరించారు. అమ్మవారి గర్భాలయ స్థానంలో నవరత్నాలు, పంచలోహాలు, నవధాన్యాలు వేసి భక్తులు అమ్మ వారికి నమస్కరించారు. అనంతరం ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కామాక్షి ఆలయం నిర్మాణ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేదపండితులు, ధర్మకర్తలు

కుప్పకూలిన స్తంభాలు.. తప్పిన ప్రమాదం

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో సోమవారం కామాక్షిదేవి భూపూజా మహోత్సవం జరిగిన కొద్దిసేపటికే గర్భాలయం పెద్ద స్తంభాలు కుప్పకూలాయి. అమ్మవారి గర్భాలయ స్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం నుంచి బయటకు వచ్చిన కొద్ది సేపటికి ఆ ప్రాంతంలోని పెద్ద స్తంభాలు పెద్ద శబ్దంతో కుప్పకూలిపోయింది. ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గతంలో వరదలకు కొట్టుకుపోయిన అమ్మవారి విగ్రహం సమీపంలోనే దొరికింది. ఇప్పుడు ఈ మండపంలోని స్తంభాలు కూలిపోవడంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు.



పెద్ద శబ్దంతో కూలిపోయిన స్తంభాలు

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ పథకాలు



పమిడిపాడులో పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని బోయలచిరివెళ్ల, పమిడిపాడు గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, కోకన్వీనర్ యు నరసింహారావు తదితరులు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, బోయలచిరివెళ్ల, పమిడిపాడు సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాలేపాటి సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నగదు పంపిణీ



బాధితులకు నగదు అందజేస్తున్న మేకపాటి

వింజమూరు (ఉదయగిరి): మండలంలో ఇటీవల తుఫాన్‌కు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మంజూరైన నగదును ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కాటేపల్లికి చెందిన బ్రహ్మయ్యకు రూ.1.25 లక్షలు, వింజమూరుకు చెందిన బీబీజాన్‌కు రూ.11,500, కిస్తీపురానికి చెందిన ఆదిలక్ష్మమ్మకు రూ.9 వేలు, వెంగమ్మకు రూ.9వేలు, బుక్కాపురానికి చెందిన సౌజన్యకు రూ.11,500, హజరత్తమ్మకు రూ.9 వేలు నగదును అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దాట్ల రమణారెడ్డి, బండి కృష్ణారెడ్డి, కొండపల్లి రమేష్, అంకినపల్లి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణపల్లిలో పరిశీలకుల సమావేశం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని బ్రాహ్మణపల్లి మేకపాటి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డు పరిశీలకుల ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నామని మేకపాటి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సమావేశంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

చుక్కల భూముల సమస్యపై విజ్ఞప్తి

కావలి: పట్టణంలోని కచ్చేరిమిట్టకు సమీపంలో సర్వే నంబర్ 1991బీలో ఉన్న ఇళ్లు, నివేశన స్థలాలను చుక్కల భూముల జాబితాలో నమోదు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని యజమానులు తహసీల్దార్ కే మాధవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సుమారు 60 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ఇళ్లు, స్థలాలను గత ప్రభుత్వం చుక్కల భూముల జాబితాలో చేర్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు బ్యాంకు రుణాలు కూడా పొందిన ఇళ్లను నిర్మించుకుంటే.. చుక్కల భూముల జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అధికారులు స్పందించి ఇళ్లను, నివేశన స్థలాలను చుక్కల భూముల జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

105 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

అల్లూరు: మండలంలోని ఇందుపూరులో 50 ఎస్టీ కుటుంబాలకు, అల్లూరు అల్లి మడుగు కాలనీలోని 55 ఎస్టీ కుటుంబాలకు ఏఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. గిరిజన నాయకురాలు సత్యవతి మాట్లాడుతూ ఇటీవల మిచాంగ్ తుఫాన్ కారణంగా పనులు లేక ఇబ్బందులు పడుతున్న చల్లా యానాదులను గుర్తించి వారికి ఏఆర్డీ సేవా సంస్థ ద్వారా నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చౌటూరు రవీంద్ర, పి.కీర్తి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేత మేడా శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయండి

• డీఈఈ బి జనార్దన్



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆత్మకూరు: విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆదా చేస్తూ వాడుకుంటే ఉత్పత్తి చేసినట్లేనని ఆత్మకూరు విద్యుత్ డీఈఈ బి.జనార్దన్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం డీఈఈ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్లో ఆయన మాట్లాడుతూ ఇంధన పొదుపు సమష్టిగా చేయాలన్నారు. అనవసరంగా విద్యుత్ వినియోగం చేయకుండా ఆదా చేయాలని ఆయన కోరారు. ఏఈలు వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు ఎంజీఆర్ కళాశాల విద్యార్థులు

ఉదయగిరి: ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం పరిధిలోని మహానందిలో అంతర్ కళాశాలల స్థాయి మూడో దశ పోటీలకు సోమవారం ఉదయగిరి మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. వాహనాన్ని కళాశాల అసోసియేట్ డీన్ టి.గోపికృష్ణ విభాగాధిపతులు టి రాఘవేంద్ర, వి.రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడో దశలో జరగనున్న పోటీలకు క్రీడలు, ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలకు అర్హత సాధించిన 29 విద్యార్థులు వెళ్లారన్నారు. వారికి క్రీడా దుస్తులు, క్యాప్, షూలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు డాక్టర్ పి.అనిల్‌కుమార్, ఎం.కిషన్‌తేజ్, బి.రమణమూర్తి, కేఎస్‌ఆర్ పాల్, సహాధ్యాపకురాలు శోభారాణి పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం



లబ్ధిదారులకు పథకాల లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు, బలహీన వర్గాల సంక్షేమం సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు నాలుగున్నరేళ్ల కాలంలో అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పార్టీలతో పని లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వమే అండగా నిలవాలనే లక్ష్యంతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. సచివాలయాల ద్వారా నేరుగా పేదల ఇంటి ముంగిటకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఇంటి వద్దకే పింఛన్లు, రేషన్ సరుకులతో పాటు మహిళలకు ఆర్థిక సాయం, వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు నివేశన స్థలాలు, పక్కా ఇళ్లు, రైతులకు రుణ మాఫీ, రైతు భరోసా కేంద్రాలు, పంట బీమా తదితర పథకాలతో ప్రతి కుటుంబానికి ఆసరాగా నిలిచినట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలకు, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహాలు అందించడం ద్వారా ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులను కించపరచడం సరికాదు

• జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌వలి



అనుమసముద్రంపేట: ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్‌వలి డిమాండ్ చేశారు. ఏఎస్‌పేట సచివాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమన్నారు. వారి హక్కుల కోసం పోరాడటంలో తప్పు లేదని, కాని తోటి ఉద్యోగులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నోటిఫికేషన్‌ద్వారా పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జాబ్ చార్టు ప్రకారం కేటాయించిన విధులు నిర్వహించడం ఉద్యోగిగా మా కర్తవ్యమని, ప్రభుత్వం అందించే సేవలన్ని పారదర్శంగా అందజేస్తున్నామన్నారు. అటువంటి వ్యవస్థను తూలనాడడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎంప్లాయీస్ మసూద్, వెంకటేశ్వర్లు, మస్తాన్, దేవా, అహ్మద్, అస్లర్ ఉన్నారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మర్రిపాడు మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సబ్ కమిటీ సభ్యుడు కరీంమొహిద్దీన్, రామిరెడ్డి రామసుబ్బారెడ్డి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా శివ రామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లురాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగరాజు, అదనపు కార్యదర్శిగా శివయ్య, జిల్లా కౌన్సిలర్లుగా శివశంకరయ్య, వెంకటేశ్వర్లు, సుందర రామిరెడ్డి, పెంచలయ్య, కె సుబ్బారెడ్డి, ఎం సుబ్బారెడ్డి, శ్రీనివాసులుతో సహా పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు అల్లంపాటి సురేంద్రరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ మర్రిపాడు మండల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

మాజీ మున్సిపల్ చైర్మన్ గ్రంధి మృతి

• నివాళులర్పించిన ఎమ్మెల్యే, ప్రముఖులు



గంధి యానాదిశెట్టి (ఫైల్)

కావలి: కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ గ్రంధి యానాదిశెట్టి (72) గుండెపోటుతో సోమవారం వేకువన మృతి చెందారు. సుమారు మూడు దశాబ్దాల పాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన గ్రంధి కావలి మున్సిపల్ కౌన్సిలర్‌గా, వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా, కావలి ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల అనారోగ్య కారణాలతో ఇంట్లోనే ఉంటున్న ఆయన వేకువ సమయంలో గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో ఇతర పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు యానాదిశెట్టి మృతదేహానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి

రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులు

సోమశిల: అనంతసాగరంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో రూ.1.15 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని సర్పంచ్ శోభ, వైఎస్సార్‌సీపీ నేత బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి బాటీపాడు తాగునీటి బావి వరకు దాదాపు 400 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని వివరించారు. డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్ సమస్యలను కూడా చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, నాయకులు ఉన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు